ఓం నమోభగవతే శ్రీ రమణాయ,

శ్రీ భారతీ దేవ్యై నమః

# ఉమా సహస్రము

## (చతుర్థ శతకమున – ద్వితీయ స్తబకము)

## చతుర్దశస్తబకము

అవ:- దేశ, కాల, రూప, అవస్థానముల నుపన్యసించుటచేత-యోగానుభవదానదక్షయు, 'కాలి, గౌరి, కుండలినీ' అని ప్రసక్తయునగు దేవి - యీపదునాలుగవ స్తబకమున ప్రస్తుతింపఁబడుచున్నది.

మూ॥ కారణమఖిలమతీనాం। వారణమన్తర్లసత్ తమసః
మన్దస్మితం మహేశ్వర। సుదృశోమే శ్రేయసేభవతు. 1

సకలములగు బుద్ధులకు కారణమును, అంతర్వ్యాప్రియమాణమగు తమస్సునకు వారణమును, అగు మహేశ్వరసుందరీ మందస్మితము నాకు శ్రేయము నిచ్చుఁగాత!

ప్రభ:- అంతః + వ్యాప్రియ మాణము = హృదయమున వ్యాపించియున్నది. తమస్సు = చీకటి, అజ్ఞానము. కారణము = మూలము – వారణము = నివారించునది. సర్వజ్ఞానములకును కారణమగుచున్న మహేశ్వరీ మందస్మితము – లోనున్న చీకటివంటి మూలాజ్ఞానమును నివారించుననునది యుక్తమే గదా! కావున – జ్ఞానలాభ – అజ్ఞాన ధ్వంసముకంటె వేరగు పరమ శ్రేయమేదియును లేదు. కావున తదుభయసాధకమగు మహేశ్వరీ మందహసితము – స్తుతింపఁబడినది.



మూ॥ విశ్వతనుస్తనుగాత్రీ, వజ్రమయీ పుష్పసుకుమారీ
సర్వస్యశక్తిరబలా కాలీగౌర్యమ్బికాజయతి॥ 2

అంబిక:- విశ్వ శరీరయు – కృశాంగియు, వజ్రమయియు– పుష్ప సుకుమారియు, సర్వశక్తియు – అబలయు, కాలియు గౌరియు అగుచు వెలయుచున్నది.

ప్రభ:- విశ్వ శరీర = బ్రహ్మాండమే శరీరముగాఁగలది. కృశాంగి = తనుగాత్రి గాత్రి = అల్పమగు శరీరము గలది. వజ్రమయి = వజ్రమణివలె కఠోరమయినది, పుష్ప సుకుమారి = పూవువలె మెత్తనిది, సర్వశక్తి = సర్వమగు పరమేశ్వరుని శక్తి, అబల = బలములేనిది, కాలి = కాలవర్ణము గలది (నల్లనిది) గౌరి = గౌరాంగి (తెల్లనిది). దేవీ శరీరము = విశ్వాత్మకము – కావున బృహద్రూపమయినది. ఆమె తను గాత్రి యను ప్రసిద్ధి యుండుటవలన అల్పమగుచున్నది. వజ్రమువలె దృఢమయినను స్త్రీ దేహముగలది కావున కుసుమకోమలయగుచున్నది. సర్వశక్తియయినను స్త్రీరూపిణి యగుటవలన ''అబల'' అని ప్రసిద్ధయగుచున్నది. కాలి – గౌరి. అను ప్రసిద్ధివలన శ్యామలయయినను శ్వేతవర్ణయగుచున్నది. ఇట్లు – భగవతియగుదేవి – అన్యోన్య విరుద్ధ లక్షణయు, అప్రమేయ స్వరూపయు నగుచున్నదని భావము. వస్తుతః, ఆమెస్వరూపమునందీ విధమగు విరోధము లేదనునంశము ముందు చెప్పఁబడును. మనకు పూర్వోక్తవిధమున భాషచేతఁ గనఁబడుచున్న విరోధము – పరమేశ్వరి, సర్వవిధముల చేతను గూడ విభాసించునది యగుట వలన స్వభావము చేతనే పరిహరింపఁబడుచున్నది. కావున నిది విరోధాభాసాలంకారమగుచున్నది. ''అపి'' ఇత్యాద్యర్థముగలది ''అయినను'' ఇత్యాదుల చేత నిచట విరోధము వాచ్యము కాకుండుట వలన నిది వ్యంగ్యమేయగుచున్నదని గ్రహించునది. ''శర్వస్యశక్తిః'' అను పాఠాంతరము – మూలమునఁ గలదు. 'శివునిశక్తి' అనునది దానియర్థము.

మూ॥ తామాహుర్జగదమ్బాం గౌరీం కేచిత్ పరేకాళీమ్।
సాగౌరీమహిలాతను రమ్బరతను రుచ్యతేకాలీ ॥ 3

(విద్వాంసులు) కొందఱు – ఆజగదంబను 'గౌరి' అనియు మఱి కొందఱు 'కాళి' అనియు చెప్పుదురు. ఆమె మహిళా శరీరయై గౌరి యగుచున్నది. ఆకాశశరీరయై 'కాళి' అని చెప్పఁబడుచున్నది.

**ప్రభ:**- ఆమె ఉభయవిధముల చేతనుగూడ ఒక్క తెయేయగును. కావున నామరూపభేదమున్నను స్వరూపము చేత మాత్రము ఆజగన్మాతకు భేదము లేదని భావము.

**అవ:**- స్త్రీ శరీరయగు – జగన్మాత యింతకుముందే స్తుతింపఁబడినది, ఇక్కడ, కాళీతత్త్వమును వ్యాఖ్యానించి – తరువాత – తద్వైభవమును వ్యాఖ్యానింపనున్నాఁడు.

మూ॥ పాచకశక్తేః కాల్యాః కేవలలిఙ్గే నభిద్య తేకాలః।
యత్ పాకతో గభీరాద్ భువనేసర్వేఽపిపరిణామాః ॥ 4

భూత – భవిష్యద్ – వర్తమాన రూపమగు కాలము (సంస్కృత భాషయందు) పుంలిఙ్గము. కాలి – స్త్రీ లింగము. (ఆ) కాలము – పాచక శక్తియగు కాలికంటె, లింగమాత్రము చేతనే వేరగుచున్నది. గంభీరమగు ఆకాలముయొక్క పాకము వలన లోకమునందు పరిణామములన్నియుఁ గూడనగుచున్నవి.

**ప్రభ :**- పాచకశక్తి = పరిపక్వము నొనర్చువాఁడు పాచకుఁడు – అతఁడే మహాకాలుఁడగు రుద్రుఁడు. వాని శక్తియే పాచకశక్తి. కాలము పుంలింగము – కాలి – స్త్రీలింగము. కావున కాలీ – కాలములకు లింగభేదమే కాని వస్తుభేదము లేదు. పరిణామములనఁగా పరిపాకములు. అ గాధమగు నే కాలముయొక్క పరిపాక కార్యమువలన లోకమునందలి పరిణామములు (మార్పులు) అన్ని



యుఁగలుగుచున్నవో, ఆ కాలము – పాచకశక్తియగు కాలికంటె భిన్నముకాదు. లింగభేదమున్నను వస్తుభేదము లేదు. కావున, కాలమే కాలియగుచున్నదని భావము. సృజింపఁబడిన సర్వమునకుఁ గూడ – ఒక రూపమునుండి వేఱొక రూపము యొక్క మార్పు కలుగునని యర్థము.

మూ॥ సర్వభువనా శ్రయత్వాత్ కాలీనామ్నా దిగన్యేన
లోకేతువ్యవహరణం విదుషాం దిక్కాలయోర్భాక్తమ్ ॥ 5

కాళి – సర్వభువనాశ్రయ, కావున నామె యింకొక నామము చేత దిశ (దేశము) అగుచున్నది. లోకమునందలి విద్వాంసులు దిక్ – కాల వ్యవహారముల నొనర్చుచున్నారు. కాని యద్భాక్తము. (ముఖ్యము కాదు)

**ప్రభ:**- దిశ = దిక్కు – దేశము, కడచిన శ్లోకమున, కాలి – కాలస్వరూపిణి. యని చెప్పఁబడినది. ఈ శ్లోకమున నామెయే దేశస్వరూపిణిగాఁ జెప్పఁబడినది అట్లయినచో పండితులచేఁ గ్రహింపఁబడు దేశ – కాలవ్యవహార మెట్లుకుదురును? అనిన '' ఆ వ్యవహారము గౌణమే కాని ముఖ్యము కానేరదు''. అని సమాధానము చెప్పఁబడినది. ఆ రెంటికిని గూడ మూలరూపము కాలియే యను సిద్ధాంతము వలన ఇట్లు దేశ కాల వ్యాపారమును వివరించుట చేత – పరమేశ్వరి యొక్కతేయే యనునంశము స్పష్టమగుచున్నది.

మూ॥ దిగదితిరఖండ్యఖణ్డా, పరిణమయిత్రీ స్మృతాకాళీ।
దక్షస్యైకా దుహితా, సాద్వేగుణభేద ముగ్ధదృశామ్ ॥ 6

దిశ– అఖణ్డయగు అదితియని చెప్పఁబడుచున్నది, కాళి పరిణామము నొనర్చునదని స్మరింపఁబడినది. ఇట్లు దక్షప్రజాపతియొక్క పుత్రియగు సతీదేవి యొక్కతెయే – గుణభేదజ్ఞానము చేత విమోహితులగు దృష్టులు గలవారికి, అదితి, కాలి అని యిద్దరగుచున్నది.

ప్రభః:- ''దో అవఖణ్డనే'' అనుధాతువువలన నిష్పన్నమగుట వలన దితి శబ్దము ఖండార్థకము. దేశము – వ్యాపకమును, పరిచ్ఛేదము లేనదియు, సగుటవలన అదితి యను పేరుగలదగుచున్నది. కావుననే అది అఖణ్డయగు నదితియని చెప్పఁబడినది. పరిణామము = పరిపాకము, పాచకశక్తియని వెనుక చెప్పఁబడుట వలన కాళి – పరిపాక విధాత్రియగుచున్నది. ఇట్లు – ఇద్దఱునుగూడ నొక్కతెయే యగుచున్నను- సర్వమునకును ఆధారమగు స్థైర్యగుణముగలదగుట చేత అదితియనియు సర్వమును పరిణమింపఁజేయు గుణము గలదగుట చేత కాలియనియు దక్షపుత్రియగు సతినే ద్వివిధగా మూఢులు తలంతురని భావము.

మూ॥ దేహేదేహేసేయం కుణ్డలినీనామ జగదమ్బా।
సాస్వపితి సంసృతిమతాం యుఞ్జానానాం ప్రబుద్ధాస్యాత్॥ 7

అదితియనియు, కాలియనియు నామభేదముచేఁ జెప్పఁబడిన యీజగదంబ- ప్రతి దేహమునందునుగూడ కుండలినియని ప్రసిద్ధయగుచున్నది. సంసారులగు పామరుల శరీరముల యందాకుండలిని నిద్రించుచున్నది. యోగుల శరీరములయందు మేల్కొనుచున్నది.

ప్రభః:- కుండలినిని గుఱించి ప్రథమ శతకమున వ్యాఖ్యానింపఁబడినది. (చూచునది)

మూ॥ మూలాధారాదగ్ని ర్జ్వలతి శిరస్తః శశీ ద్రవతి
కుణ్డలినీమయిమస్యే వీణాశయనాత్ ప్రబుద్ధేయమ్ ॥ 8

ఆధారచక్రము లాటీఁటిలోపలను మొదటిదగు మూలాధారము నుండి అగ్ని – ప్రజ్వలించుచున్నది. శిరస్సునందలి సహస్రారమునుండి శశి స్రవించుచున్నది. (కావుననే) ఈ కుండలి నీ శక్తి – వీణాశయనము నుండి మేల్కొనినదని యూహించుచున్నాను.



ప్రభః:- శశి = సోమము = అమృతము. సహస్రారము – సోమ నిలయమనియు, మూలాధారము – అగ్ని కుండమనియు, యోగులయందు ప్రసిద్ధములు. కుండలిని మేల్కొనునప్పుడే యోగియందు – అగ్ని – జ్వలించుటయు, సోమము = స్రవించుటయు సంభవించును. మస్తకము మొదలుకొని మూలాధారము వఱకును గల అస్థిపంజరిక – వీణాదండమువలె నుండును కావున వీణయని చెప్పఁబడుచున్నది. ఆవీణయనుశయనము. వీణాశయనమని యిచటఁజెప్పఁబడినది.

''యాతాయాతవిహారే, నృతనుషు విహరన్తీంత్వామ్'' (4 స్తబ – శ్లోక – 6.7) అను శ్లోకద్వయమును – వ్యాఖ్యానించునపుడు ప్రథమశతకమునందే యీ యంశము ప్రదర్శింపఁబడినది.

మూ॥ యద్ ద్రవతి తత్రకింత్వం కింతత్రత్వమసి యజ్జ్వలతి
కిముతత్రాసి మహేశ్వరి! యదుభయమేతద్విజానాతి ॥ 9

శిరస్సు నుండి ఏది స్రవించుచున్నదో, అచ్చట నీవున్నావా? మూలాధారమునుండి యేది జ్వలించుచున్నదో అచ్చట నీవున్నావా? లేక, ఓ మహేశ్వరీ! సోమద్రవణమునకును, అగ్నిజ్వలనమునకును మూలమగుచు, నా రెండింటిని గూడ నేది తెలియుచున్నదో అచ్చటనీవున్నావా?

ప్రభః:- సోమము (అమృతము) శిరస్సు నుండి స్రవించుచుండును. అగ్ని మూలాధారమునుండి జ్వలించుచుండును. ఆధారచక్రముల కన్నింటికిని ఆధారమగుచు, దహరమను పేరుగల హృదయాకాశమునందు – ఈ సోమాగ్నులు ప్రతిష్ఠింపబడినవి. కావున వానికిమూలమగు నీదహరాకాశము వానిని తెలియుచుండును. కావున నీవు సోమమునందున్నావా? అగ్నియందున్నావా? సోమాగ్నిమూలమగు హృదయమునందున్నావా? అని ప్రశ్నింపఁబడినది.

మూ॥ ఏతావగ్నీషోమౌ - జ్వాలాభిశ్చన్ద్రికాభిరపి
ఆవృణుతస్తనుమనయోర్వ్యక్తిత్వం మేపశుర్భవతు॥ 10

(త్వగింద్రియము చేతఁ దెలియఁబడుచున్న) ఈయగ్నీషోములు – జ్వాలల చేతను, చంద్రికల చేతను గూడ నా శరీరమును ఆవరించుచున్నారు. ఈయగ్నీషోములకు నావ్యక్తిత్వము – (అహంకార సహితమగు పృథగాత్మత్వము) పశువు అగుగాత. (హింసింపఁదగిన మేకమున్నగు జంతువువంటిది అగుఁగాత!)

**ప్రభ:**-అగ్నీషోవులు = మూలాధారమునందలి యగ్నియు, సహస్రారమునందలి సోముఁడును, జ్వాలలచేతను = ఉష్ణదీప్తుల చేతను, చంద్రికల చేతను = శీతదీప్తుల చేతను, మూలాధారమునందలి యగ్ని – జ్వాలల చేతను, సోముఁడు– వెన్నెల చేతను యోగినగు నా శరీరము నావరించుచున్నారు. లోకులకందఱకును – ''నేను'' తదితరుల కంటె వేఱగు స్వరూపాదికము గలవాడను అనువ్యక్తిత్వము గలదు. ఇదియే సంసారబంధహేతువు. కావున – ఈ వ్యక్తిత్వము – నశించుటయే ముక్తియగుచున్నది. కావున నా వ్యక్తిత్వము – అగ్ని షోములకు పశువగుగాతయని కోరఁబడినది – యజ్ఞమునందు పశువును చంపుదురు. ఇట్లు చంపుటకు ఆలంభము అని పేరు. ''జ్యోతిష్టోమేన స్వర్గ కామోయజేత'' అగ్నిష్టోమమున (అగ్నికిని సోమునకును సంబంధించిన యజ్ఞమునందు) పశ్వాలంభమొనర్చెదరు. మానవునియందుఁగల వ్యక్తిత్వము పశువువంటిది. కావున, అగ్నిష్టోమమునందొనర్పఁబడు పశ్వాలంభము వ్యక్తిత్వనాశనమునకు చిహ్నమని తెలియవలయును. ప్రథమస్తబకమున దక్షయాగ కథయొక్క రహస్యము తెలుపఁబడినది. **ఇచట కవి స్వానుభవమును ప్రసంగించి అగ్నిష్టోమముయొక్క యాదార్థ్యమును వ్యాఖ్యానించెనని గ్రహించునది.** (యజ్ఞము నందొనర్పఁబడు పశ్వాలంభము – వ్యక్తిత్వనాశమే అని తెలియనపుడది స్వర్గకామమును సంపాదించునని తెలియునది.)



మూ॥ అగ్నిస్త్వం సోమస్త్వం త్వమధోజ్వలసి ద్రవస్యూర్ధ్వమ్।
అమృతమనయోః ఫలంత్వం తస్యచభోక్త్రీచిదమ్బ త్వమ్ ॥ 11

అమ్మా! అగ్నివి నీవు. సోముఁడవు నీవు. నీవు క్రిందినుండి (మూలాధారము నుండి) జ్వలించుదానవు. నీవు మీఁదినుండి (సహస్రారమునుండి) ద్రవించుదానవు. నీవు అగ్నీ షోమకార్యములగు జ్వలనద్రవణములకు ఫలమును భోగ్యమును అగు నమృతముకూడ నీవే. ఆయమృతమును భుజించునదియగు చిత్తు (చితి) కూడ నీవే.

**ప్రభ:**- ఇట్లు భోక్త్రియగు చిత్తు, భోగ్యమగు అమృతము, జ్వలన – ద్రవణాత్మికయగు – భోగక్రియ, భోగకరణభూతులగు అగ్నీషోములు, అనుసర్వమును గూడ నీవే యగుదువని భావము.

మూ॥ కిన్నుసుకృతంమయాకృత మఖిలేశ్వరి! కింతప స్తప్తమ్।
క్రీడయసి మాం ప్రతిక్షణ మానన్దసుధానిధావన్తః ॥ 12

నేను ఏమి సుకృతము నొనర్చితినో, ఏతపము నాచరించితినో నన్ను ప్రతిక్షణమునందును ఆనందామృత సాగరాంతరమున క్రీడింపఁజేయుచున్నావు.

**ప్రభ:**- సుకృతమనగా – సత్కర్మానుష్ఠానము, తపమనఁగా – కాయక్లేశ జనకమగు చాంద్రాయనాధి వ్రతముగాని, అనన్య విషయమగు ధ్యానముగాని యగును. విచ్ఛేదము లేకుండ, ప్రతిక్షణమునందును నన్నానందసుధానిధియం దోలలాడించుచున్నావు. నేనొనర్చిన యేసుకృతమునకు లేక యేతపమునకు ఫలముగా, నాయందీయ సాధారణమగు ప్రసాదము నొనర్చుచున్నావో నేనెఱుఁగనని భావము.

మూ॥ క్షాన్తంకిం మమదురితం, శాన్తంకిందేవి! తే స్వాన్తమ్।
అనుగృహ్ణాసివిచిత్రం మామప్యపరాధినాం ప్రథమమ్ ॥ 13

దేవీ! నాపాపము – ఛాంతమయినదా? నీస్వాంతము శాంతమయినదా! అపరాధులలో ప్రథముఁడనగు నన్నుఁగూడ అనుగ్రహించుచున్నావు. ఆశ్చర్యము!

**ప్రభ:**- ఛాంతము = సహింపఁబడినది. స్వాంతము = మనస్సు, శాంతము= శాంతినొందినది. నా పాపములను సహించి, తొలగించి నన్ను క్షమించి ప్రసన్నురాలనైతివా? అని భావము. అమ్మా! దోషులలో మొదటివాఁడనగు నన్నుఁగూడ అనుగ్రహపాత్రు నొనర్చుచున్నావు. ఇది యాశ్చర్యదాయకమగుచున్నది. కావున నిన్ను ప్రశ్నించుచున్నాను. ''నీవు నాపాపములను క్షమించి, వానిని తొలగించి, నన్ను క్షమించి ప్రసన్నురాలనైతివా?''

ప్రశ్న :- అయ్యా! ఉమాసహస్రకర్తయగు మహాకవి – ఇచట– అపరాధులలో తానే ప్రథమముఁడనని యేల చెప్పెను?

ఉత్తరము :- లోకమందలి పాపము సమస్తమును స్వీయమే (తనదే) అని అభిమానించి – నేనే పాపాత్ములలో నగ్రణినని చెప్పుచున్నాఁడు. కావుననే – యిందలి ప్రథమ శబ్దము ప్రథమగణ్యత్వమును స్ఫురింపఁజేయుచున్నది.

దానిచేత – '' ఉదారచరితానాంతు వసుధైవ కుటుమ్బకమ్'' ఉదారమగు ప్రవర్తనగల వారికీ జగత్తే కుటుంబము. అనుసూక్తిననుసరించి, ఇచట నీకవియొక్క ''మహాసత్త్వత'' వ్యంజింపఁజేయఁబడుచున్నది.

మూ॥ కాలేకాలే సన్ధ్యారూపా నోపాసితాభవతీ।
విచ్ఛిన్నః స్మార్తాగ్నిస్త్రేతా కుత ఏవవహ్నీనామ్ ॥ 14

శ్రౌత – స్మార్త కర్మానుష్ఠానము కొఱకు విధివిహితములగు కాలములయందు సంధ్యారూపయగు పరమేశ్వరినుపాసింపనయితిని. స్మార్తాగ్నిని కూడ విచ్ఛిన్న మొనర్చితిని (దాక్షిణాత్య – గార్హపత్య ఆహవనీయములను) అగ్ని త్రేత (త్రయము) యింకెక్కడ? అదియు విచ్ఛిన్నమే యయినది.



**ప్రభ:**- శ్రౌతకర్మలనగా, శ్రుతిరూపమగు వేదమునందుఁ జెప్పఁబడిన కర్మలు. స్మార్తకర్మలనఁగా స్మృతిరూపములగు ధర్మశాస్త్రములయందుఁ జెప్పఁబడినకర్మలు. సంధ్యారూప = అహోరాత్రముల సంధియందుదయించిన కాలము సంధ్య అదియే రూపముగాఁగల పరమేశ్వరి – సంధ్యారూప. ''నేను – సాయంప్రాతస్సంధ్యా వందనమును గూడ చేయుటలేదు. వివాహమయిన తరువాత నుంచఁబడి విచ్ఛిన్నమయిన, ఔపాసనాగ్నియగు స్మార్తాగ్నిని గూడ – మరల సంధింపనయితిని. స్మార్తాగ్నియే విచ్ఛిన్నమగునపుడు శ్రౌతాగ్ని = విచ్ఛిన్నమయినదని వేఱుగా చెప్పనక్కఱయే లేదు గదా:- ఇట్లు విధి విహితములగు శ్రౌత – స్మార్త కర్మల నొనర్పకున్నను, నాయందనుగ్రహించుచున్నావని భావము.

మూ॥ దాతుం నార్జితమన్నం బహుదేవేభ్యశ్చ భూతేభ్యః
యత్కిఞ్చిదార్జితం వా కలత్రపుత్రాన్వితోఽశ్నామి॥ 15

దేవతల కొఱకును, భూతముల కొఱకును ఇచ్చుటకు బహులమగునన్నము నార్జింపనయితిని. ఏ కొంచెమో సంపాదించినను దానిని కలత్రపుత్ర సహితుఁడనై నేనే భుజించుచున్నాను. (అనుభవించుచున్నాను.)

**ప్రభ:**- గృహస్థులకు కర్తవ్యములగు పంచమహాయజ్ఞములు – దేవ – పితృ- భూత – బ్రహ్మ – మనుష్య యజ్ఞములు.

''పూజా – సపర్యాఽధ్యయనం బ్రహ్మయజ్ఞస్తుతర్పణమ్।
హోమోదైవో బలిర్భౌతో నృయజ్ఞోఽతిథిపూజనమ్.''

నేను వేదపాఠ పితృతర్పణములను విడిచి యితరములగు యజ్ఞములను అనఁగా వైస్వదేవమును, భూతబలిని, అతిథిపూజనమును గూడ చేయని స్వార్థపరుఁడనయితినని భావము.

మూ॥ కశ్చిదపిపాపహారీ నపురశ్చరితశ్చతే మన్త్రః
కం గుణ మఖిలక్ష్యమమ ప్రబుధ్యసేఽ స్తర్జగన్మాతః ॥ 16

పాపహారియగు నీయొక్క మంత్రమును దేనినిగూడ పునశ్చరణము నొనరింపనయితిని. (యథోక్తసంఖ్యలచే జపింపనయితిని)

జగజ్జననీ! నాయందుఁగల యే గుణము నభిలషించి (వీక్షించి) నాలో మేల్కొనుచున్నావు?

ప్రభ:- పాపహారి = పాపములను నశింపఁజేయునది. పునశ్చరణము = ఒకానొక మంత్రమును దేనినయినను శాస్త్రోక్తమగు సంఖ్యననుసరించి జపించుట. నేను మంత్రములనేకముల నెఱుఁగుదును. అయినను తంత్రశాస్త్రము యందుఁ జెప్పఁబడిన విధిననుసరించి జప పునశ్చర్యను గావింపనయితిని. నాయందెట్టి సుగుణమును గాన్పింపకున్నను నీవు నా హృదయమున మేల్కొనుచునే యున్నావు. ఇది యాశ్చర్యముగానున్నదని భావము.

మూ॥ తవమయి పృథక్ తనూజప్రేమాచేత్ పక్షపాతోఽయమ్।
అథవా సతాంనిసర్గః సోఽ యంత్వయిచామ్బ! సమ్భావ్యః ॥ 17

అమ్మా! నీకు – నాయందు ప్రత్యేకమగు పుత్ర ప్రేమ యుండిన యెడల నది పక్షపాతము కావలయును. లేక (పక్షాంతరమున) సజ్జనులకది స్వభావము కావచ్చును. (కావున) ఆ పక్షపాతము నీయందుఁగూడ సంభవింపవచ్చును.

ప్రభ:- అమ్మా! లోకమునందున్న వారలందఱును నీకుదయించినవారే అయినను నీవు నాయందు విశేషించి ప్రీతిగలిగియుండుటకు పక్షపాతమే హేతువు కావలయును. అందఱకునుగూడ నీవొక్క తెవేగదా తల్లివి? (అనిచెప్పి) ఒకవేళ పక్షపాతముగూడ దోషము కాకపోవచ్చును. లోకమునందున్న సజ్జనులకుఁగూడ



తమకుఁగల యనేక పుత్రులలో నొకనియందు పక్షపాతము కాన్పించుచున్నది. కావున నది నీయందును సంభావ్యమేయగునని యర్థాంతరన్యాసము చేయఁబడినదని గ్రహించునది.

ఇప్పుడు నేననుభవించుచున్న యత్యద్భుతమగు నీయోగానుభవ విశేషమునకు హేతువు – నీకు నాయందుఁగల పక్షపాతమే గాని, నాయొక్క గుణ – కర్మాది యోగసాధన విశేషములు (హేతువు) కావని భావము.

మూ॥ లక్ష్యం వినైవమన్త్రః కిం సిద్ధ్యతి కోటిశోఽప్యుక్తః
దధ్మస్తద్యదిలక్ష్యం తవరూపం గలతిహా! మన్త్రః ॥ 18

ఒక మంత్రము కోటిమార్లు జపించినను గూడ ధ్యానగమ్యమగు నొకానొకలక్ష్యమును విడిచిన యెడల నేమిసిద్ధించును. ఆకారణము వలన లక్ష్యమగు నీరూపమును మనస్సు చేత ధరించితిమా! అయ్యో! (జప్యమానమగు) మంత్రమే తొలగిపోవుచున్నది.

ప్రభ:- వెలుపలనున్న దేవ విగ్రహాదులయందుఁగాని, లోనున్న, ఆధార చక్రాదులయందుఁగాని ధ్యానముచే నెఱుఁగదగిన లక్ష్యమేదో యొకదానిని గుర్తింపక, ఊరకమంత్రమును వల్లెవేయుట వలన లాభము లేదు. (లక్ష్యము లేనిదే మంత్రసిద్ధి కలుగదు) అలాగని నీరూపమగు నాలక్ష్యమునే మనస్సు చేత ధ్యానించునెడల, జపించుచున్న మనస్సు చేత మంత్రము విడువఁబడుచున్నది. ఇది మహత్తరమైన కష్టమగుచున్నది.

మూ॥ సఙ్కల్పానాం వాచామనుభూతీనాం చయమ్మూలమ్।
యత్రప్రాణోబద్ధ స్తల్లక్ష్యం దేవి! తేరూపమ్ ॥ 19

దేవీ! సంకల్పములకు – వాక్కులకు – అనుభూతులకు – మూలము (ఉదయస్థానము) ఏదో, ఎక్కడ ప్రాణము బంధింపబడినదో, ఆ నీ రూపము – (ధ్యానగోచరమగు) లక్ష్యము.

ప్రభ:- వాక్, ప్రాణ, మనో ఉనుభూతులకు మూలస్థానమగు నీరూపమే గమ్యస్థానమగు లక్ష్యభావము.

మూ॥ నైసర్గికస్వవృత్తే రహఙ్కృతేర్మూల మన్విష్య
త్వాంకిల సాక్షాత్ కురుతే రమణమహర్షేరియం దృష్టిః॥ 20

స్వాభావికియగు ఆత్మీయవృత్తిగల అహంకృతియొక్క మూలమును - అన్వేషించి, చిత్ స్వరూపిణివగు నిన్ను సాక్షాత్కరించుకొనెనట! ఇది (నాయొక్క గురుడగు) రమణమహర్షి యొక్క దృష్టి (సాక్షాద్దర్శనము)

ప్రభ:- స్వాభావికి = స్వభావసిద్ధము ఆత్మీయవృతి = నిజవ్యాపారము. మూలము = ఉత్పత్తిస్థానము. అన్వేషించి - వెదకి. అహంకార మూలాన్వేషణము వలన మూలస్వరూప సాక్షాత్కారము కలుగుననునది శ్రీరమణమహర్షియొక్క స్వానుభవ పూర్వకమగునుపదేశమని భావము. భగవానుడగు రమణమహర్షి ఉపదేశసారమునందిట్లు ప్రవచించియున్నాడు.

అహమయం కుతో భవతి చిన్వతః
అయిపతత్యహం నిజవిచారణమ్
అహమ పేతకం నిజవిభానకమ్
మహదిదంతపో, రమణవాగియమ్.

మూ॥ మస్యేపర్వతకన్యే, మరుసేయమహఙ్కృతి ర్మహతీ
అవతరతా వర్షగణై - రపి తన్మూలం నలబ్ధమహో॥ 21

పర్వతకుమారీ! ప్రస్తుతమగు ఈనాయహంకారము - బలిష్ఠమని తలంచెదను. ఏల? అనిన; బహు వర్షములనుండియు శిరస్సునుండి హృదయమునకు అవతరించుచున్నను గూడ నాకాయహంకృతిమూలము లభించినది కాదు. ఆశ్చర్యము! లేక లోకాంతరము నుండి యవతరించి ఎన్నో సంవత్సరముల నుండియు ప్రయత్నించుచున్నను నా కాయహంకృతి మూలము లభింపకున్నది. ఆశ్చర్యము!



ప్రభ:-మనోవృత్తి స్థానమగు శిరస్సు నుండి హృదయమునకుఁ యోగము చేత పలువర్షముల నుండియు అవరోహించుచున్నాను (లేక) వేఱొక లోకము నుండి యిచ్చటికి వచ్చి చాల కాలమునుండియు ప్రయత్నించుచున్నాను, అయినను నాకా యహంకృతిమూలము లభించినది కాదు. కావున నాయహంకారము బలిష్ఠమయినదని భావము. ''క్షీణేపుణ్యేమర్త్యలోకం విశన్తి'' అని చెప్పుదురు. స్వర్గమునందున్న వారు - అహంకృతి మూల స్వరూపజ్ఞానము వలనమోక్షము నొందుటకు మానుషజన్మము నొందుదురనునది తత్త్వరహస్యము కావుననే శ్రుతియిట్లనుచున్నది.''

'' ఇహ చేద వేదీదథ సత్యమస్తి నచేదిహావేదీన్మహతీ వినష్టిః''

ఈ మనుష్య జన్మమునందే తెలిసికొన్న యెడల సత్యము లభించును. అట్లు తెలిసి కొననియెడల గొప్ప వినాశము కలుగును.

''మధ్యే వామన మాసీనం విశ్వేదేవా ఉపాసతే''

''శరీరమునందున్న హృదయమునం దాసీనుఁడయిన వామనుని (పరమాత్మను) అందఱు దేవతలును గూడ ఉపాసించెదరు.'' కావున అహంకార మూలమును బడయుటకు పరలోకము నుండి నేనీలోకమున మానుషజన్మమునందితిని. ఇట్లవతరించినను ఇంత కాలమునకుఁగూడ అహంకారమూల స్వరూపము నొందనయితినని తాత్పర్యము.

మూ॥ ఏష ప్రౌఢో భగవతి! బహులం గర్జత్యహఙ్కారః।
ఏతస్మి న్నయికాలే భవతీ చాబోధి కుణ్డలినీ॥ 22

భగవతీ! మిగులబలిసిన నాయీయహంకారము - అధికముగా గర్జించుచున్నది. తల్లీ! ప్రౌఢమగు నహంకారము గర్జించుచున్న యీ సమయమునందు కుండలినీ శక్తివగునీవు కూడ మేల్కొనుచున్నావు.

**ప్రభ:**- గర్జించుచున్నది. దర్పముతో శబ్దించుచున్నది. ప్రౌఢము = ప్రవృద్ధము. మిక్కిలిబలిసినది, కుండలిని - ప్రబుద్ధమగునపుడు - అహంకారమునకు ప్రాబల్యముండఁగూడదు. అయినను అది ప్రబలమేయగుచున్నది - కావున నది హంతవ్యమని ముందు చెప్పనున్నాఁడు.

మూ॥ తవ పశ్చాత్ సముత్థితిం జానాతి నసో౽యమద్యా౽పి
ప్రాగివ గర్జతి ధీరం బిభేతి మృత్యోర్నసేదిష్ఠాత్ ॥ 23

ఆ యీ యహంకారము - నీ పశ్చాత్ ప్రాదుర్భావమును (నీవు తరువాత ప్రాదుర్భవించుటను) ఇప్పటికిని తెలిసికొనకున్నది. కావుననే పూర్వమునందువలెనె ధీరముగా గర్జించుచున్నది. అత్యంతసమీపమగు మృత్యువువలనఁగూడ భయపడకున్నది.

**ప్రభ:**- యోగ సాధనమున పశ్చాన్మార్గమనియు, పురోమార్గమనియు, రెండుత్రోవలు రాజయోగసారమను గ్రంథమునఁ బ్రతిపాదింపఁబడినవి. ''అంశేనావిశ్యాదౌ'' 'యాతాయాతవిహారే' అను ఉమాసహస్ర ప్రథమ శతకమునందలి నాల్గవస్తబకమునందున్న **5, 6**వ శ్లోకములయందుఁగూడ- ఈ పశ్చాన్మార్గ - పురోమార్గద్వయము విస్తరింపఁబడినది ( ఈ యంశమును ప్రథమ శతకమున; జూచునది.) అహంకారము తెలివిలేనిది. కావున తనవెనుక నీవావిర్భవించు చున్నావని యది యెఱుఁగదు. (అహంకారము నశించినతఱువాతనే కుండలినీ ప్రాదుర్భావము పూర్ణమగునని యర్థము.) అహంకారము ముందుండఁగా, భగవతియగు కుండలిని వెనుక మేల్కొని ప్రకాశించును. ఇదియే కుండలిని వగు నీయొక్క పశ్చాత్ ప్రాదుర్భావము. ఈనీ ప్రాదుర్భావమును - ముందుండి గర్జించుచున్న యహంకారమెఱుఁగదు. కావుననే వెనుక గర్జించినట్లే యిప్పటకిని గట్టిగా గర్జించుచున్నది. మృత్యువు తన్ను మిక్కిలియు సమీపించినదను భయము గూడ దానికిఁగలుగుట లేదు. (దానికి మృత్యు భీతికూడ లేదు) అని తాత్పర్యము. కావుననే నీకాయహంకారమును బలిగా నిచ్చెదననుచున్నాఁడు.



మూ॥ అతిపుష్టమహఙ్కారం పశుమేతం తుభ్యమర్పయతే
ప్రమథపతి ప్రాణేశ్వరి! గణపతి రేకాన్త భక్తో౽యమ్ ॥ 24

ప్రమథగణపతి ప్రాణేశ్వరి వగు జననీ! ఏకాంతభక్తుఁడగు ఈగణపతి - నీకొఱకు - అతిపుష్టమగు (బాగుగాబలిసిన) ఈ యహంకారపశువును సమర్పించుకొనుచున్నాఁడు.

**ప్రభ:**- ప్రమథగణములనఁగా, భూతసమూహములు. వాని ప్రభువగు నీశ్వరుని ప్రాణములకు నీవీశ్వరివి. ''నేను వేఱొక దేవతను విశ్వసింపని నీయంతరంగ భక్తుఁడను. తెగబలసిన యీ నాయహంకారపశువును నీకు బలిగానిచ్చుచున్నాను. బలిసిన పశువేగదా? హోమమున కుపయుక్తమగు ద్రవ్యము. ఈ బలిని స్వీకరించి కర్తవ్యమును నిర్వహింపుము'' అని భావము.

మూ॥ ఉపగీతయోగణపతేః, ఉపతిష్ఠన్తామిమాః పీత్యా!
ఉత్సవసహస్రలోలా ముకార వాచ్యస్యగృహనాథామ్ ॥ 25

గణపతి కవికృతములగు - ఈ యుపగీతులు: -

ఉత్సవసహస్రలోలయు, ఉకారవాచ్యుఁడగు శివుని యొక్క గృహిణియునగు పార్వతిని ప్రీతితో సమీపించి సేవించుఁగాత!

**ప్రభ:**- ఉపగీతులు = ఉపగీతివృత్తరచితములగు స్తుతులు. ఉత్సవ సహస్రలోల= కుండలినీ శక్తి యొక్క సంతతములగు విలాసములు - ఉత్సవసహస్రములు (ఉత్సేకములు) వానియందు చలించునది. ఉకారవాచ్యుఁడు ఉకారపదముచే దెలియఁదగిన స్వరూపముఁ గలవాడు.

ఇది సవ్యాఖ్యమగు చతుర్దశస్తబకము.

****